క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దాసరి

సుల్తానాబాద్‌: మున్సిపల్‌ పరిధిలోని 6వ వార్డుకు చెందిన సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకులు ఆరెపల్లి మధు మంగళవారం పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని మధు అన్నారు. మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ తిప్పారపు కమల–దయాకర్‌, బీఆర్‌ఎస్‌ ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు ఆరెపల్లి ఇలారావు, నాయకుడు రాజు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ

పెద్దపల్లిరూరల్‌: పేదల ఆరోగ్యం కోసం బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 137 మంది లబ్ధిదారులకు రూ. 39.06లక్షల విలువగల చెక్కులు పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ రఘువీర్‌సింగ్‌ పాల్గొన్నారు.

ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

జూలపల్లి: నాలుగు రోజుల క్రితం ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి తండ్రి నోముల అంజిరెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఎంపీపీతో పాటు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. జూలపల్లి మార్కెట్‌ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు లోక రవీందర్‌రెడ్డి, పొలగాని సతీశ్‌, కోఆప్షన్‌ సభ్యుడు లాల్‌ మహ్మద్‌, శ్రీనివాస్‌ ఉన్నారు.

ఉపాధ్యాయుల ఔదార్యం



బోర్‌ మోటార్‌ అందిస్తున్న ఉపాధ్యాయులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్‌ ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బోర్‌మోటార్‌ చెడిపోయింది. కాగా మంగళవారం విద్యార్థుల అవసరాలను గుర్తించిన ఉపాధ్యాయులు వెంకటనర్సయ్య, కందుల సతీశ్‌కుమార్‌ రూ.16వేలు చెల్లించి నూతన బోర్‌మోటార్‌ కొనుగోలు చేసి బిగించారు. మోటార్‌ను మండల విద్యాధికారి పల్లెపాటి సంపత్‌రావు, కాంప్లెక్స్‌ హెచ్‌ఎం ఓదెలు చేతుల మీదుగా అందజేశారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు.

క్రీడల్లో రాణించాలి

ఎలిగేడు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జెడ్పీ వైస్‌ చైర్‌పర్సన్‌ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ ఉన్నత పాఠశాలలో జెడ్పీహెచ్‌ఎస్‌ ధూళికట్ట, సుల్తాన్‌పూర్‌, ఎలిగేడు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సీనియర్‌, జూనియర్‌ విభాగాల్లో మంగళవారం మండలస్థాయి ఎస్‌జీఎఫ్‌ క్రీడా పోటీలు ప్రారంభించారు. సర్పంచ్‌ బూర్ల సింధూజ, ఎంఈవో కవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవన్‌రెడ్డి, పీఈటీలు హరికృష్ణ, ఎల్‌.శ్రీనివాస్‌, వి.శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

అర్హులకు దళితబంధు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ముత్తారం: దళితబంధు పథకంలో అర్హులను ఎంపిక చేయకుండా బీఆర్‌ఎస్‌ పార్టీకి చెందిన వారికే ఇచ్చారని మండలంలోని పారుపల్లికి చెందిన దళితులు మంగళవారం ముత్తారం–పెద్దపల్లి ప్రధాన రహదారి పారుపల్లిలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద ధర్నా చేశారు. గ్రామంలో 350 దళిత కుటుంబాలకుగాను 8 మంది బీఆర్‌ఎస్‌కు చెందిన వారికే దళితబంధు ఇవ్వడంపై స్థానిక దళితులు ఆందోళన చేశారు. అర్హులకు దళితబంధు ఇవ్వాలని, లేనియెడల తహసీల్దార్‌, రెవెన్యూ డివిజన్‌ కార్యాలయాలు ముట్టడిస్తామన్నారు. కాంగ్రెస్‌ ఎస్సీ సెల్‌ మండల అధ్యక్షుడు సంపత్‌, నాయకులు శంకర్‌, కిషోర్‌, ప్రదీప్‌, మధూకర్‌, రాజు పాల్గొన్నారు.

రక్తదానం

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీకి చెందిన వైకే ఫౌండేషన్‌ సభ్యుడు వేణుగోపాల్‌ మంగళవారం 4వ సారి రక్తదానం చేశారు. గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పుట్టిన బాబుకు బీ ప్లస్‌ రక్తం అత్యవసరం కాగా వైకే ఫౌండేషన్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు కండెం సురేశ్‌కు సమాచారం అందించారు. స్పందించిన సురేశ్‌ ఫౌండేషన్‌ సభ్యుడు వేణుగోపాల్‌కు తెలపడంతో ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. అత్యవసర సమయంలో రక్తం కోసం 9866470788, 99515 06666 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



యైటింక్లయిన్‌కాలనీ: రాఖీ కడుతున్న విద్యార్థులు



ముత్తారం: రాఖీ కడుతున్న విద్యార్థులు



జూలపల్లి: మాట్లాడుతున్న ఎస్సై వెంకటకృష్ణ

యైటింక్లయిన్‌కాలనీ: విద్యార్థి దశ నుంచే మహిళా చట్టాలు, సైబర్‌ మోసాలు, ట్రాఫిక్‌ రూల్స్‌, షీటీంలపై అవగాహన పెంచుకోవాలని గోదావరిఖని టూటౌన్‌ ఎస్సై చంద్రశేఖర్‌ అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్‌ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన మహిళలకు రక్షణ, భద్రత పోలీస్‌ బాధ్యత అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్‌ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆపద సమయంలో డయల్‌ 100కు ఫోన్‌ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు పోలీసులకు రాఖీ కట్టారు. టూటౌన్‌ ఏఎస్సై సుధాకర్‌, రామలక్ష్మి, పోలీస్‌ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్రెపల్లి మోడల్‌స్కూల్‌లో

సుల్తానాబాద్‌రూరల్‌: మండలంలోని గర్రెపల్లి మోడల్‌ స్కూల్‌లో చట్టలపై అవగాహన కల్పించడంతో పాటు రక్షాబంధన్‌ వేడుకలను పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఎస్సై వినీత మాట్లాడుతూ బాలికల ఆత్మరక్షణ కోసం ఉన్న చట్టాల గురించి వివరించారు. అనంతరం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ రఘునాథ్‌, ఉపాధ్యాయులకు రాఖీ కట్టారు. పీజీటీ బిక్షం, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

ఎలిగేడు/జూలపల్లి: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఆ లక్ష్యం చేరుకునే దిశగా కృషి చేయాలని జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ సూచించారు. ఎలిగేడు, జూలపల్లి మండలాల్లోని పలు పాఠశాలల్లో మంగళవారంఎస్సై వెంకటకృష్ణ పోలీసు సిబ్బందితో అవగాహన సమావేశాలు నిర్వహించారు. సైబర్‌క్రైమ్‌, షీటీం, డయల్‌ 100పై అవగాహన కల్పించారు.

కమాన్‌పూర్‌: మండలంలోని రొంపికుంట ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం కమాన్‌పూర్‌ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు షీటీం, సైబర్‌ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం చంద్రయ్య, పోలీసు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముత్తారం కేజీబీవీలో..

ముత్తారం: ముత్తారంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మహిళల భద్రత.. పోలీసు బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ముత్తారం ఎస్సై మధుసుధన్‌రావుకు, పోలీసులకు బాలికలు రాఖీ కట్టారు. కేజీబీవీ ఎస్‌వో కమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మారం కస్తూర్బాలో..

ధర్మారం: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో మహిళల భద్రత, షీటీమ్స్‌ ఉపయోగం, ఆన్‌లైన్‌ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీసులకు విద్యార్థులు రాఖీ కట్టారు. ఎస్సై అశ్విని, ప్రిన్సిపాల్‌ విజయలక్ష్మి, డబ్ల్యూపీసీ నాగ ప్రణవి, సతీశ్‌, రమేశ్‌ పాల్గొన్నారు.

ఓదెల: ఓదెల, పొత్కపల్లి గ్రామాల్లోని హైస్కూల్‌, మోడల్‌స్కూల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. పొత్కపల్లి ఎస్సై నూతి శ్రీధర్‌, ప్రధానోపాధ్యాయులు, మోడల్‌ పాఠశాల ప్రిన్సిపాల్‌ జావిద్‌, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌: మహిళల భద్రత, షీటీంల ఉపయోగంపై మంగళవారం కేజీబీవీ హైస్కూల్లో ఎస్సై శ్రీనివాస్‌ విద్యార్థినులకు అవగాహన కలిపించారు. ప్రిన్సిపాల్‌ శ్రీదేవి, ఏఎస్సై నీలిమ, హెడ్‌ కానిస్టేబుల్‌ ఆనందం, మమత, కానిస్టేబుల్‌ శ్రీశైలం, రజినీ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు

రామగిరి: మహిళల భద్రతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారని, మహిళల రక్షణకు పోలీసు శాఖ చర్యలు తీసుకుంటోందని గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు అన్నారు. రామగిరి ఎస్సై రవిప్రసాద్‌ ఆధ్వర్యంలో మంగళవారం మహిళల భద్రత పోలీసుల బాధ్యత అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని, మహిళలు, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సైబర్‌ మోసాలపై 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్‌ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం పలువురు విద్యార్థులు అధికారులకు రాఖీ కట్టారు. కార్యక్రమంలో మంథని సీఐ సతీశ్‌, ఎస్సై దివ్య పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో

మంథని: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని.. ఆ హక్కును వినియోగించుకోవాలని మంథని ఆర్డీవో హనుమ నాయక్‌ కోరారు. మంథని మండలం అక్కేపల్లి గ్రామంలో మంగళవారం ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సింగరేణి జీఎం సుధాకర్‌, గ్రామ సర్పంచ్‌ రాజయ్య, ఆర్‌ఐ రాజిరెడ్డి ఉన్నారు.

ఓటరు దరఖాస్తులను ఆన్‌లైన్‌ చేయాలి

కమాన్‌పూర్‌: మండలంలో ఓటర్‌ నమోదుకు, సవరణల కోసం బీఎల్‌వోలకు అందించే దరఖాస్తులను రోజువారీగా ఆన్‌లైన్‌ చేయాలని మంథని ఆర్డీవో హనుమ నాయక్‌ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ప్రజావాణి, ధరణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్‌ మోహన్‌రెడ్డి, సిబ్బందిని ఆయన ఆదేశించారు.

దళితులను మోసం చేసిన కేసీఆర్‌



దీక్షలో బీజేపీ నాయకులు

మంథని: సీఎం కేసీఆర్‌ హుజూరాబాద్‌ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని దళితబంధు స్కీం ప్రకటించి కేవలం బీఆర్‌ఎస్‌ నాయకులకు మాత్రమే పథకం అమలు చేస్తున్నారని, దళితులందరినీ మోసం చేశారని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆరోపించారు. దళిత గోస బీజేపీ పార్టీ భరోసా దీక్షలో భాగంగా మంథని తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట మండల కమిటీ అధ్యక్షుడు బూడిద రాజు ఆధ్వర్యంలో నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. జిల్లా అధికార ప్రతినిధి పోతరవేణి క్రాంతి, మండల అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్‌, పట్టణ అధ్యక్షుడు బూడిద తిరుపతి, మండల ఇన్‌చార్జి తోట మధూకర్‌, మహిళా మోర్చా అధ్యక్షురాలు బోసెల్లి మౌనిక ఉన్నారు.

తెలుగు భాష అమ్మలాంటిది



కాల్వశ్రీరాంపూర్‌: వేడుకల్లో విద్యార్థులు, టీచర్లు

సుల్తానాబాద్‌: తెలుగు భాష అమ్మలాంటిదని సుల్తానాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు బాలకిషన్‌ ప్రసాద్‌ అన్నారు. మున్సిపల్‌ పరిధిలో ఉన్న వివేకానంద హైస్కూల్‌లో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు బోధించే రజిత, రవీందర్‌, శారదను సన్మానించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

రామగిరి: సెంటినరీకాలనీ కృష్ణవేణి పాఠశాలలో మంగళవారం తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ధ్యాన్‌చంద్‌ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతి అందజేశారు.

ముత్తారం: ముత్తారం ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో మంగళవారం తెలుగు భాసా దినోత్సవం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ జీఎల్‌ఎన్‌ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌: కాల్వశ్రీరాంపూర్‌ ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు భాషా గొప్పతనాన్ని హెచ్‌ఎం ఈర్ల సమ్మయ్య, ఏఎస్సై రఘు విద్యార్థులకు వివరించారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ జెండా ఎగురవేయాలి



పార్టీలో చేరుతున్న నాయకులు

ఎలిగేడు: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ఎండగడుతూ వచ్చే ఎన్నికల్లో పెద్దపల్లిలో కాంగ్రెస్‌ జెండా ఎగురవేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని శివపల్లిలోని ఆయన నివాసంలో ఓదెల మండలం బాయమ్మపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పేదల సంక్షేమం పట్టని పాలకులు

పెద్దపల్లిరూరల్‌: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్‌ పాలకులు ప్రజాసంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని విజయరమణారావు ఆరోపించారు. పెద్దపల్లి మండలం భోజన్నపేటలో గడపగడపకూ విజ్ఞన్న కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల ప్రజలకు మేలు కలుగుతుందన్నారు.

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

జూలపల్లి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బూత్‌ కమిటీలను పటిష్టం చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి సూచించారు. మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తలు పార్టీ విజయానికి సమన్వయంతో కృషి చేయాలన్నారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కంకణాల జ్యోతిబసు, పార్టీ మండల అధ్యక్షుడు కూసుకుంట్ల రవీందర్‌రెడ్డి, ధర్మపురి అసెంబ్లీ ఇన్‌చార్జి కన్నం అంజయ్య, మీస అర్జున్‌రావు, నాయకులు గుడిపాటి సంతోశ్‌రెడ్డి, మల్లారపు హన్మంతు, ముదిరాజ్‌ సంఘం అధ్యక్షుడు బొజ్జ కనుకయ్య ఉన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవం



సుల్తానాబాద్‌లో క్రీడా ఉత్సవం

సుల్తానాబాద్‌: మండల కేంద్రంలోని ఇండియన్‌ పబ్లిక్‌ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయుల మధ్య వాలీబాల్‌ పోటీలు నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ జయంతి సందర్భంగా కేక్‌ కట్‌ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

కేంద్రీయ విద్యాలయంలో..

జ్యోతినగర్‌: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్‌ టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయంలో క్రీడా దినోత్సవం నిర్వహించారు.

రామగుండంలో గులాబీ జెండా ఎగరాలి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చందర్‌

గోదావరిఖని: రాబోయే ఎన్నికల్లో రామగుండంలో గులాబీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ పిలుపునిచ్చారు. పట్టణంలోని మార్కండేయ కాలనీలోని ప్రయివేట్‌ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పాలకుర్తి మండలం తక్కళ్లపల్లి, బసంత్‌నగర్‌కు చెందిన వందమంది ముస్లిం మహిళలతో పాటు మరో వంద మంది పార్టీలో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్కసారి అవకాశం ఇవ్వండి అంటూ కాంగ్రెస్‌ పార్టీ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు మొదలుపెట్టిందని, వారికి ఓటు వేస్తే మళ్లీ అధోగతి తప్పదన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ ప్రవేశపెట్టిన పథకాలు అందని గడపలేదని, ప్రజలు కేసీఆర్‌కు ఓటు వేసి రుణం తీర్చుకోవాలన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కు అందజేత

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 11మంది లబ్ధిదారులకు చెక్కులు అందించారు. సర్పంచ్‌ తుంగపిండి సతీశ్‌, కుర్ర నూకరాజు, అర్జునపల్లి శ్రీనివాస్‌, ఎదులాపురం వెంకటేశ్‌, పిల్లి రమేశ్‌, దాసరి శ్రీనివాస్‌, అల్లి గణేశ్‌ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఉపసర్పంచులు

పాలకుర్తి: మండల పరిధిలోని వివిధ గ్రామాల ఉపసర్పంచులు మంగళవారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో ఉపసర్పంచ్‌ల ఫోరంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్తపల్లి ఉపసర్పంచ్‌ బుట్టి శ్రీకాంత్‌, ఉపాధ్యక్షుడిగా జయ్యారం ఉపసర్పంచ్‌ గాజుల ఐలయ్య గౌడ్‌ను ఎన్నుకున్నారు. వివిధ గ్రామాల ఉపసర్పంచులు మాదాసు సతీశ్‌, గొల్లపల్లి విష్ణు, వినోద్‌, జక్కుల నర్సయ్య పాల్గొన్నారు.

రామానుజుల ఉత్సవ విగ్రహాల బహూకరణ



ఉత్సవ విగ్రహాలను అందిస్తున్న కృష్ణమూర్తి

కమాన్‌పూర్‌: మండల కేంద్రంలోని శ్రీఆదివరాహస్వామి ఆలయానికి రూ.లక్ష విలువగల రామానుజ, నమ్మాళ్వార్లు, మనవాళమహాముునుల ఉత్సవ విగ్రహాలను సిద్దిపేటకు చెందిన ఉప్పాల కృష్ణమూర్తి, అశోక్‌ కుటుంబ సభ్యులు మంగళవారం బహూకరించారు. స్వామివారి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్సవ విగ్రహాలను అందించినట్లు కృష్ణమూర్తి తెలిపారు. కోలేటి మారుతి, అంజయ్య, వేణు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

పెద్దపల్లిరూరల్‌: చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో ఆరోగ్యంగా ఉంటూ వయసుకు తగ్గట్టుగా ఎదుగుతారని సీడీపీవో కవిత అన్నారు. పెద్దపల్లిలోని సాగర్‌రోడ్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రోత్‌ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అందించాల్సిన ఆహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. సెక్టార్‌ సూపర్‌వైజర్‌ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్‌ రజిత, రేఖ, శ్రీదేవి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦బీసీబంధుకు అర్హులుగా గుర్తించాలి

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీ పరిధి కేకే నగర్‌కు చెందిన వడ్డెర కులస్తులను బీసీబంధుకు అర్హులుగా గుర్తించాలని గ్రామ మాజీ నాయకులు డిమాండ్‌ చేశారు. మంగళవారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. గ్రామంలోని దాదాపు 20మంది వడ్డెర కులస్తులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్‌, సంబంధిత అధికారులు స్పందించి కేకేనగర్‌ గ్రామాన్ని సందర్శించి విచారణ చేసి న్యాయం జరిగేలా చూడాలని బత్తిని శ్రీనివాస్‌గౌడ్‌, చాట్ల సదానందం, మాసుక్‌ రబ్బానీ కోరారు.

✦అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

మంథని: డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్‌, పాలకుర్తి మండలాల్లో పలు అభివృద్ధి పనులకు సీడీపీ ద్వారా రూ.2.61కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్‌లోని ఐదు మండలాల్లో బస్‌ షెల్టర్లు, రోడ్లు, మురుగు కాల్వలు, కమ్యూనిటీ భవనాలు, బోర్‌వెల్స్‌, హైమాస్‌ సెంట్రల్‌ లైట్లతో పాటు ఇతర పనులు మంజూరైనట్లు తెలిపారు.

✦బీఎస్పీలో చేరిక

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్‌ 39వ డివిజన్‌ ప్రగతినగర్‌, గౌతమినగర్‌లో బడుగు బలహీన వర్గాలు అధికారం చేపట్టాలన్న లక్ష్యంతో రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్‌ నాయకత్వంలో మంగళవారం మహిళలు బీఎస్పీలో చేరారు. బీఎస్పీ అంతర్గాం మండల అధ్యక్షుడు చిలుక రామ్మూర్తి, సిరికొండ సాయి, రమేశ్‌, రజిత, జక్కుం కవిత, కనుక లక్ష్మి, పద్మ, రేణుక, రంజిత్‌, శ్రీకాంత్‌, విష్ణువర్ధన్‌ పాల్గొన్నారు.

✦వచ్చేనెల 3న డిస్మిస్‌ కార్మికుల సమావేశం

గోదావరిఖని: గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సెప్టెంబర్‌ 3న డిస్మిస్‌ కార్మికుల సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శనిగరపు నారాయణ తెలిపారు. సమావేశానికి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు అంటోని నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

✦డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు

ధర్మారం: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం డీఎంఎఫ్‌టీ నిధులను మంజూరు చేసింది. మంత్రి కొప్పుల ఈశ్వర్‌ సహకారంతో రూ.7.07కోట్లు మంజూరైనట్లు ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ తెలిపారు. కటికెనపల్లి–పెద్దపల్లి రోడ్డు రెన్యూవల్‌ కోసం రూ.2.70కోట్లు, కటికెనపల్లి–చామనపల్లి వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.96 లక్షలు, రచ్చపల్లి–ఖిలావనపర్తి రోడ్డు రెన్యూవెల్‌ కోసం రూ.1.16కోట్లు, పత్తిపాక ఎక్స్‌ రోడ్డు నుంచి ల్యాగలమర్రి వరకు రూ.కోటి 50 లక్షలు, మారేడుపల్లి–శానబండ వయా ముంజంపల్లి వరకు రూ.75లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరైనట్లు ఆమె వెల్లడించారు.

మత్స్య కార్మికులకు గుర్తింపుకార్డులు ఇవ్వండి

సుల్తానాబాద్‌: పట్టణంలోని సుగ్లాంపల్లికి చెందిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న గుర్తింపుకార్డులు ఇవ్వాలని కలెక్టర్‌ ముజామిల్‌ ఖాన్‌ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆరేళ్ల నుంచి సంఘంలో సభ్యులుగా ఉన్నప్పటికీ, గుర్తింపుకార్డులు లేకపోవడంతో పలు రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులం కావడం లేదని, వెంటనే సంఘం గుర్తింపు కార్డులను అధికారులు అందజేయాలని కోరారు.

✦వ్యాపార సంస్థలకు ట్రేడ్‌ లైసెన్స్‌ తప్పనిసరి

కోల్‌సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపార సంస్థలన్నీ డీఅండ్‌ఓ ట్రేడ్‌ లైసెన్స్‌ తప్పనిసరిగా తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ సీహెచ్‌ నాగేశ్వర్‌ సూచించారు. ఈ మేరకు నగరపాలక సంస్థ పరిధిలోని వ్యాపార సంస్థలకు మంగళవారం నోటీసులు జారీ చేశారు. నగరంలోని అన్ని రకాల వ్యాపార సంస్థలు నగరపాలక సంస్థ నుంచి డీఅండ్‌ఓ ట్రేడ్‌ లైసెన్స్‌ పొంది ఉండాలని వివరించారు.

పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి



హాకీ పోటీలు ప్రారంభిస్తున్న పుట్ట మధు

రామగిరి: తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని జెడ్పీచైర్మన్‌ పుట్ట మధు కోరారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా హాకీ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో స్థానిక రాణి రుద్రమదేవి స్టేడియంలో జూనియర్స్‌ హాకీ టోర్నమెంట్‌ నిర్వహించారు. రత్నాపూర్‌, పన్నూర్‌, రాజాపూర్‌ సర్పంచ్‌లు పల్లె ప్రతిమ, అల్లం పద్మ, పాశం ఓదెలు, వైస్‌ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, పూదరి సత్యనారాయణగౌడ్‌, మ్యాదరబోయిన కుమార్‌, పుల్లెల కిరణ్‌, బుద్దె ఉదయ్‌, కాపురబోయిన భాస్కర్‌, హాకీ అసోసియేషన్‌ ప్రతినిధులు ముఖేష్‌, సలీం, అల్లం రమేశ్‌ పాల్గొన్నారు.

బలహీనవర్గాలు ఏకం కావాలి



ప్రచారం చేస్తున్న దాసరి ఉష

పెద్దపల్లిరూరల్‌: బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఏకం కావాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌లో మంగళవారం మన ఊరు–మన ఉష కార్యక్రమంలో పాల్గొని ఇంటింటా ప్రచారం చేశారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీసీలకు పోటీ చేసే అవకాశం కల్పించని ప్రధాన రాజకీయ పార్టీలను ఓడించాలని కోరారు. బీసీల అభ్యున్నతికి పాటుపడేది బీఎస్పీ మాత్రమేనని పేర్కొన్నారు. నాయకులు వెంకటేశ్‌, సవిత, ఎండీ రియాజ్‌, శోభ, అరుణ, శారద, అజీం, రవికుమార్‌, రాహుల్‌ పాల్గొన్నారు.

ఘనంగా ఓనం సంబరాలు



జ్యోతినగర్‌: ఎన్టీపీసీ రామగుండంలో ఓనం పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పర్మనెంట్‌ టౌన్‌షిప్‌, ప్లాంటు, టీటీఎస్‌లోని గోదావరి భవన్‌లోని ఇండియన్‌ కాఫీ హౌజ్‌(ఐసీహెచ్‌) సభ్యులు ఓనం సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం



మట్టి గణపతులతో విద్యార్థులు, టీచర్లు

పెద్దపల్లిరూరల్‌: గణేశ్‌ చవితి పండుగ నాడు మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుకుందామని సమగ్రశిక్ష సమన్వయకర్త షేక్‌ అన్నారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం కాలుష్యనియంత్రణ మండలి, పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మట్టివినాయకుల తయారీపై వర్క్‌షాప్‌ నిర్వహించారు. హరితదళం రాష్ట్ర ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్‌ మట్టితో వినాయక విగ్రహాల తయారీపై అవగాహన కల్పించారు. కాలుష్య నియంత్రణ ప్రతినిధి సత్తయ్య ప్రత్యేకంగా రూపొందించిన వాహనంలోని రోబో పర్యావరణ హితం కోసం చేసే ప్రక్రియను వివరించారు.